


ఈ మధ్య బొత్తిగా ఒంటిగాణ్ణయిపోయాను. భద్రం దారిన భద్రం చెక్కేశాడు. డిటెక్టివు క్లబ్బుకేసి పోతే అక్కడ ఒక్క డిటెక్టివు లేడు. ఇప్పుడందులో ఎవరో ఎగ్రస్టులుంటున్నారు. పోనీ గవరయ్య మావన్నా అవుపిస్తే అదో మోస్తరుగా ఉండును.

ఆశ్చర్యం! కాలం ఎంతలో ఎంతగా మారుతుంది! నిన్నగాక మొన్న ఎటు జూసినా డిటెక్టివులే. ఎక్కడజూసినా డిటెక్టివులే. బస్సుల్లో, పేవుమెంట్లమీదా, కిళ్లీకొట్ల చూర్లు పట్టి వేళ్లాడుతూ... ఇప్పుడేరీ? గవరయ్య మావ చెప్పిన మందేదో ఉండేవే—ఒక విధమయిన గ్యాసు—అది వాడితే నల్లులు మాయమయినట్లు మాయమయారు. బతుకులో మహా రహస్యం ఏమీ లేకుండా పోయింది. ఒక్క కేసు లేదు. అసలు అంతకుల్లేరు!

సినిమాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని భద్రం అంటూ వచ్చాడు. వాడు బీడీమీద బీడీ తగలేస్తూ, ఎగ్రస్టులని కాజెయ్యటానిక్కూడా ఉత్సాహంలేకుండా ఉన్నాడంటే సినిమాలకి గిరాకీ తగ్గిందన్న మాటే... అసలు వాడేడీ? వాణ్ణిచూసి మూడ్రోజు లయింది. మూడ్రోజుల క్రిందట తువాలా తలకు చుట్టి బీడీకట్ట జేబులో దోపుకుంటూ హడావుడిగా ఉంటే, "ఎక్కడికి, భద్రం?" అని అడిగా.

"చిన్న పందగిలింది, గురో. పోస్టర్లంటించాలంట" అన్నాడు.

"సినిమాలకే దిక్కులేకపోతే ఇంకా పోస్టర్లేవిటి?" అనడిగా.

"ఇది సినిమాలకన్నా పెద్ద గిరాకీలే, గురో. మళ్లొచ్చి చెబుతాగా?" అన్నాడు. అంతే. అదేహో పోత!

అందుకని ఒంటిగా కూచుని పాతకేసులన్నీ గ్యాపకం చేసుకొని కలలు కంటం మొదలుపెట్టాను. ఎన్ని కలలు! ఎన్ని కల్లు! ఎంతెంత కల్లు! కల్లు... సారా... కల్లు... సారా... కల్లు ....కారా...

ఉలిక్కిపడి లేచాను. కొందరు పిల్లలు మాయింటి ముందు చెట్టుకింద ఏవో కేకలు పెడు

తున్నారు: "పిడక్కే మీ వోటు—పిల్లికే మీ వోటు!"

ఎంత విన్నా క్లూ దొరకలా. బీడీల ప్రచారం చేసే కుర్రాళ్ల ఇట్టాగే, "ఏం బీడీ కావాలి? వీర్రాసి బీడీ కావాలి!" అని అరుస్తారు. ఈ పిల్లలు పిడకల్నీ, పిల్లుల్నీ అమ్ముతున్నారా ఏమిటి?

ఈ మిస్టరీ గురించి ఆలోచించేటంతలో దేవుడల్లే గవరయ్య మావ వచ్చాడు.

"రా, మావా! భద్రం ఎక్కణ్ణా కనిపించాడా?" అనడిగా.

"బాగున్నావా అల్లుడా? శాన్నాళ్లాయి నువ్వు పించి. బద్దరవా? ఆడు యెలెక్సన్లంట తిరగటంలా?" అన్నాడు గవరయ్య మావ.

"కొత్త యెగస్ట్రా దొరికిందేంటి, మావా?"

గవరయ్య మావ కష్టపడ కూచుని అవిటి కాలు రుద్దుతూ, "ఎలెక్సనంటే యెగస్ట్రా అనుకుంటున్నావు గావాల. యేకంగా టూరే ననుకో!" అన్నాడు.

"మన భద్రం యాకంగాశారునే పట్టాడా?" అన్నా హాశ్చర్యంగా.

మావ కొబ్బరాకులు గలగల్లాడేట్టు నవ్వి, "అవులే నీకీ యెలెక్సను గొడవే తెలీదన్న మాట. సెబుతా ఇనుకో. ఇప్పుడు సరకారుండది గదా?" అనడిగాడు.

"అవును, పోలీసులూ, డిటెక్టివులూ—"

"పోనీ, అట్టనే అను. ఈ సరకారంతా నడవటానికి మంతుర్లూ, శాసన సబలూ అయింతా ఉండాలి గద!"

"శాసన సబలంటే?"

"అట్టడుగు చెబుతా. శాసన సబల్లో సీట్లుంటై!"

"ఏం చీట్లు?"

"సీట్లుగా దల్లుడా, సీట్లు!"

"సినిమా హాల్లో ఉన్నవిధంగానా?"

"కరకట్! మరా సీట్లలో ఎవరు కూచోవాలా అన్నది తేల్చటానికి ఎలెక్సన్లు జరుపుతారు. ఎలెక్సన్లంటే ఎన్నికలనుకో."

"డబ్బిచ్చి టిక్కెట్లు కొనుక్కుంటే పోలా?"

"సివరకట్టాగూ అదే జరుగుద్దనుకో. కాని ఇందులో ఓ పేద్ద తిరుగుడుండాది. టిక్కెట్లు తెచ్చుకున్నోళ్లందరికీ సీటు జిక్కదు. ఒక్కో సీటుకు తొమ్మిదిమంది టిక్కెట్లు తీసుకుంట్రు! ఒక్కడికే సీటొస్తది. ఏ ఒక్కడో నిర్ణయించటానికే ఎలెక్సన్లు! ఇప్పుడంతా అర్థమయిందా, అల్లుడా?"

"టిక్కెట్లూ, సీట్లూ తెలిసిందిగాని, ఆ ఓటు—అదేంటో కూడా కాస్త చెప్పు మావా?"

"ఎన్నికల మాటేనా? ఇదుగో సూడు, మనందరికీ ఓటుంటది. నీకో ఓటూ, నాకో ఓటూ, మన బద్రంకో ఓటూ—అట్టా. ఈ ఓటు తీసకపోయి ఒక సీటు కెయ్యాలి. ఒక సీటుకు మరి శానామందుంటారుగా టిక్కెట్టుకొన్నోళ్లు. ఆళ్లంతా కుక్కలాల ఈదులంబడిపడి తిరుగుతూ 'బాబూ, నీ ఓటు! నాయినా నీ ఓటు! పేదోణ్ణి బాబయ్యా, ఓటిప్పించి రచ్చించాల! నాయినల్లారా, నన్ను గెలిపియ్యండి! సామివుల్లారా, నన్ను నెగ్గించండి. లేకపోతే బతకను' అనాటాని ఓట్లడుగుతారు. సరే తగలెయ్యని మనం మన ఓటు పిల్లికో, పిచ్చికో, పిడక్కో, పీచుకో యేసి పారేసి సేతులు కడుక్కుంటాం."

నా హాశ్చర్యం కప్పంటేంది.

"ఈ హోటడిగేది పిల్లులూ, పిచికలూనా, మావా?" అన్నా.

మావ నవ్వుకు ఒక కొబ్బరాకు లేచి నిలబడింది.

"అంతా తలో బొమ్మ యేసుకుంటారు. యెనకంటకి భారతయుద్ధంలో యీరులంతా జెండాలమీద కోతిబొమ్మలూ, చెట్లబొమ్మలూ, గెద్ద బొమ్మలూ అవీసేసలా? అదే తంతనుకో!"

"అంటే ఈ టిక్కెట్లు కొనుక్కున్న వాళ్లంతా తలో బొమ్మా గేయిస్తరంటావా, మావా?"

"ఐ."

"గీసుకొని ఆళ్ల బొమ్మకి హోటెయ్యమంటారు."

"ఐ."

"ఇందులో హంత్రావం ఏ వంత ఉన్నట్టు లేదే. సాగితే డిటెక్టివే జోరుగా ఉంటుంది గదా!"

ఈ మాట మావకు పెద్ద ఉద్రేకం తెప్పించింది.

"ఇదుగో, సూడు, ఈ యెలక్సన్లు మించిన సంబరం బ్రెపంచెవులో లేనే లేదనుకో. ఏం పొన్మత్లూ! ఏం ఊరేగింపులు! ఏం కేకలు! పెళ్లోరిల్లే! 'హారేయ్, అన్నాంకు యేర్పాటయిందా? ఓరే సీపాలు బద్దరం చేశారా? కర్రలు మరవమాకండ్రోయ్! ఆ పిల్లాళ్ళు ఈ టెలు పట్టుకు తిరుగుతున్నారంట! ఈ దెబ్బని పిడక్కి డిపాజిట్టు గల్లంతే! చూస్కోమంతడాకా!' ఈవిధంగా మాట్లాడుకుంటారు. మన బద్దరం గాడికి ఈ పాటికి గొంతుపోయుంటది.... అదుగో, ఇన్నావుగా? ఆ కుర్రాళ్ళు సక్కెర బిళ్లలు సేతిలో బెడితే, 'పిల్లికే మీ ఓటు', 'పిడుక్కే మీ ఓటు' అని అట్టనే అరుస్తారు... నువ్వట్ట ఈదు లెంటరా, ఆ సంబరం ఏందో నీకే తెలుస్తుంది. రెండు రోజులుగా నేమా, మా కుర్రాళ్లూ బస్సెక్కా, బస్సుదిగా, బస్సెక్కా, బస్సుదిగా. అంతా చిత్రయాపారంగా ఉంది. పక్క జేబుల్లో పరుసు వేసుకునేవోళ్లంతా కారెక్కి తిరుగుతుండ్రి. ఏం చస్తా?"

"అయితే, మావా? ఈ హెలక్సన్లో అంత కుల హోర్పాటేమీ ఉండదా? నా కదంటే సరదా అన్నికు తెలుసుగా!"

"సర్లే, అంతా వేరాల పుట్టేసనుకో. పోలీ



భిక్షాటన శివుడు

ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)

## నెర్వీటాల్

నరముల బలహీనతకున్నూ, రక్త పోటునకున్నూ రామబాణము. అనుభవ యుక్తముగా చేయబడినది.

**8 ఔ సీసా 5-75 పోస్టేజి 1-75**

**ఇండియన్ మెడిసిన్ హౌస్,**

**విజయవాడ-2.**

ఫొటోగ్రాఫర్లకు కానుక!

## ఎడ్రాస్

**(Adross)**

**ఫోటో ప్రింటింగ్ పేపర్లు**

మంచి ఫొటోగ్రాఫిక్ పేపర్లు కరువైన ఈ రోజుల్లో, ఎడ్రాస్ ప్రైవేట్ లిమిటెడ్ కలకత్తా వారిచే మనదేశములోనే తయారు చేయబడి, విదేశములనుండి దిగుమతి అగుచున్న మంచి రకముల పేపర్లతో సమానముగా పోటీపడుచున్నవి. దేశములోని అనేకమంది ఫొటోగ్రాఫర్లచే విరివిగా వాడబడుచూ, ఉత్తమమైన పేపర్లుగా ప్రశంసింపబడుచున్నవి.

నేడే ఒక ప్యాకెటు మీ సమీపములోని డీలరు వద్ద కొని ఉపయోగించి చూడండి.

**డీలర్లులేని ప్రదేశములలో**

**సమర్థులైన డీలర్లు కావలెను**

వివరములకు :

ఆంధ్రప్రదేశ్ కంతటికీ డిస్ట్రిబ్యూటర్లు:

**మధూ ఫొటో & రేడియో కంపెనీ,**

పోస్టు బాక్సు: 34, మచిలీపట్నము.

**మా డీలర్లు:** మాతా స్టూడియో, విజయవాడ; గట్టు వెంకటేశ్వర్లు, తెనాలి; బాపట్ల: శ్రీ విజయలక్ష్మి స్టోర్సు, గుడివాడ; శ్రీ రామా ఫైన్ ఆర్టు స్టూడియో, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం; మెట్రో స్టూడియో, కాకినాడ; కృష్ణాస్టూడియో, ఏలూరు; బాబా స్టూడియో, ఒంగోలు; ఫొటో ఎంపోరియం, విశాఖపట్నం; జి. కె. ఎం. స్టోర్సు, విజయనగరం.


# ఎన్నికలలు!

వోళ్ళు కూడా ఈ వాల్రోజులా కలిగించుకోరు. ఓ బుడ్డి కాలీచేసి పోలీసోడి ముందుగా తూలొస్తే! వాడు నోటికి సెయ్యడ్డం పెట్టి నవ్వుకుంటా, 'ఈ ఓటు పిడక నాసనేస్తుందే!' అనుకుంటాడు. అంతేగాని సారిబిసమా, గిరిబిసమా, 'ఓ పావలా, తగలెయ్' అనటాన్కి! అంతా యుద్ధమే అనుకో, అల్లుడా. అయితే గ్రాంధీ మహాత్ముడన్నట్టు అయింస. పెద్ద ఈరులు టెక్కెట్లు పుచ్చుకున్నాళ్ళు. రథాలకు బదులు కార్లు. జెండాలకు బదులు జెండాలు. కాల్బంట్లు కాన్వాసర్లు. బాణాలేసి కొట్టుకోవటానికి బదులు ఓరి మీదోరు సొన్నర్గంటించుకుంటారు; మైకు లదిరేట్టు ఉపన్నేసాలిస్తారు. మైక్లంటే శంకాలే అనుకో! రగతానికి బదులు సారా యేర్లుగట్టి పారుద్ది. మరిది యుద్ధ మన్నాక హింసయం జరక్కుంటదా? అదే దబ్బా, ఏదో ఉండె, ఆ ఊళ్ళో ఒక అబ్బోరిది తల పగలగొట్టేశారు. గట్టిపేసం. బతికాడు. మెల్లగా డంటన్నారు.”

ఆలోచిస్తున్నాను. ప్రపంచంలో ఇంత హాస్యాశ్చర్యం ఉంటే నాకు కొంచెం కూడా తెలియదు గద. తెలిస్తే నేను కూడా ఒక టిక్కెట్టు కొందునే!

మావ నన్ను బజార్లు తిప్పాడు. ఓ, ఏం కోలాహలం! పార్పగండా చివరోజుట. ఎన్ని కొత్త మాటలు! హబ్బర్తి, పార్పగాండా, బాలేటు, పోయిలింగు, బూతు—! (ఆ రాత్రి భద్రం నాతో, గురో, రేప్పొద్దుణ్ణుంచీ అందరూ బూతుకాడే ఉంటారు, అంటే నాకు అర్థమవక “బూతుకాడికిపోదలిస్తే రాత్రే పోరాదూ?” అన్నా! తరవాత ఒకటి రెండు బూతులు చూశా.

ఆటిల్లో నాకేమంత బూతు కనిపియలా. ఆడంగులు మగాళ్ళకి సంబంధం లేకుండా నిలబడ్డారు.)

మధ్యాహ్నం వేళ భద్రం వచ్చాడు. జేబులో డబ్బులు గలగల్లాడుతున్నై. మనిషిమట్టిగొట్టుకు మండటానికైతే నేం, సంతోషానికైతే నేం, మూడు కాల్షీట్లు వరసగా చేసొచ్చినట్టున్నాడు.

“గురో, మన పంట పండింది. ఇదుగో బీడీ కట్ట. ఇంకాస్సేపుండి నేనో శాల్తీని తెస్తా.

వాడు ఓటడుగుతాడు. ఓటెవరి కేస్తున్నా వంటే తడూకోకుండా పిల్లికని చెప్పెయ్యాలి.

అట్టగాదు పిడక్కొయ్యాల, తప్పదు అంటాడు. పిల్లివోళ్ళు పదిస్తానంటున్నారె అనాలి. పోనీ అంతా అయితే మేమో పదిచ్చుగుంటాం, తప్పుతుందా అంటాడు. అళ్ళ ముందడిగారు గదా అనాలి. ఆడు పదికి మించేటట్టు లేకపోతే, పోనీ మీరు మంచోళ్ళే ఉన్నారు, ఆ పదే తగలెయ్యండి అనాలి. మద్దె మద్దె నేను కూడా మాటగలుపుతాలే, గురో.”

నా క్కోప మొచ్చింది. “చూడు, భద్రం! నువ్వేపనిచేసినా అంతా డొంక తిరుగుడుగా, తెరమరుగుడుగా ఉంటుంది. డిటెక్టివు మానేసి సినిమా వెంట తిరిగావు. ఇప్పుడవి మానేసి ఈ హెలక్షన్ల వెంట పడ్డావు. నీ కెంతసేపటికీ డబ్బు గొడవ తప్ప ఇంకేమీ పట్టదు. నాకు హెరాట క్కర్లేదం చెప్పేస్తా. హంతే!” అన్నా.

భద్రం బుర్ర గోక్కున్నాడు. తరవాత వాడు వెళ్ళి పోయాడు. మరో గంటకు ఎవణ్ణో పట్టుకొచ్చాడు. ‘కరిగించిన శవం’లో అంతకుడు త్రివిక్రముడల్లే ఉన్నాడా మనిషి. ఆ మనిషి నాతో ఏమీ అనలేదు. భద్రమే నాతో, “గురో, ఈ నాయుడుగారు పిల్లి తరపున పనిచేస్తున్నారు. పాపం పోయినా మీరు పిల్లికి వోటెయ్యరని, మీ వోటు పిడక్కి తప్ప దక్కదని చెప్పాను. అంటే వారంటారు గదా, ‘వారివోటు పిల్లికెయ్యకపోతే మానె, పిడక్కెయ్యకుండా ఉంటేచాలు’ అన్నారు. అందుకన్నా ఒప్పుకోండి, గురో” అన్నాడు.

నా కోపచూపులు భద్రంపై దూసి, “నే నెవరికీ వోటెయ్యను లే. ఇక దయచెయ్యి” అన్నాను.

భద్రం త్రివిక్రముడితో, “ఇంకేం, నాయుడుగారూ, గురువుగారు అటు మార్యేడిటు పాడినా ఆడి తప్పరు” అన్నాడు. ఇద్దరూ కలిసి వెళ్ళి పోయారు.

చెట్టుకింద గుసగుసలు వినిపించి తడిక కంతలోనుంచి డిటెక్టను చేసి, త్రివిక్రముడు భద్రం చేతిలో ఒక అయిదు రూపాయల నోటు ఉంచుతున్నట్టు కనిపెట్టగలిగాను.

మర్నాడు మావ నన్ను ఒకటి రెండు బూతులు తిప్పాడు. హెలక్షన్ల పోర్పాటం అయిపోయింది. మోటంగుల జనమంతా బూతుల దగ్గర సొల్లుగా నిలబడ్డారు. అంతా బాగానే జరిగిపోయింది.

కాని అసలుమిష్టరీ ఏంటంటే ఆసాయంకాలం అయిదున్నరకు హాకస్మాత్తుగా ఆ త్రివిక్రముడు నన్ను ఓటల దగ్గర నిలేసి, “ఏదీ వేలు?” అన్నాడు.

“మీరేమంటున్నదీ నాకు తెలవటం లేదనటానికి సాహసిస్తున్నాను” అన్నాను గంభీరంగా.

“నీ ఎడం చేతి చూపుడు వేలు చూపవయ్యా, గురో!” అన్నాడు. నేను మళ్లీ ఒక ఘాటైన వాక్యం ఆలోచిస్తుంటే ఆయనే నా చెయ్యి పట్టుకొని, వేళ్ళు పరీక్షించి, “అదే నాక్కావలసింది!” అంటూ నన్ను చూసి నవ్వి తందార్న తాను పోయాడు.

ఇందులోని మిష్టరీ నాకు అర్థం కాకుండా ఉంది. వెళ్ళేటప్పుడు ఆ త్రివిక్రముడు ఒక్కక్కా కూడా వదిలి పోలేదు. దగ్గర భూతద్దం కూడా లేదు... ఆలోచిస్తున్నాను— ★